
సాక్షి జగిత్యాల

మంగళవారం : 28 : ఫిబ్రవరి : 2023



ప్రజావాణికి 32 ఫిర్యాదులు

జగిత్యాల: సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి 32 దరఖాస్తులు వచ్చాయి. కలెక్టర్ యాస్మిన్‌భాషా ఫిర్యాదులు స్వీకరించి, సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



వేసవిపండ్లు.. లాభాలు

వేసవిలో లభించే పండ్లతో జిల్లాకు చెందిన రైతు దంపతులు లాభాలు పొందుతున్నారు. నేరుగా మర్కెంటింగ్ చేస్తున్నారు. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 35.0/18.0

వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం కొనసాగుతుంది. ఉక్కపోత ఉంటుంది. రాత్రిపూట చలిగాలులు వీస్తాయి. చలి ఉంటుంది.

న్యూస్‌రీల్

స్త్రీనిధి రుణాలు వసూలు చేయాలి



మాట్లాడుతున్న ఆనందరావు

జగిత్యాలజోన్: స్త్రీనిధి రుణాలు మార్చి 15 లోపు వసూలు చేయాలని స్త్రీనిధి రీజనల్ మేనేజర్ ఆనందరావు అన్నారు. జగిత్యాల మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఆర్పీలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగిత్యాల పట్టణం పరిధిలో స్త్రీనిధి నుంచి రుణాలు తీసుకున్న వారినుంచి మార్చి 15లోపు సొమ్మును వసూలు చేయాలని సూచించారు. మొండి బకాయిలు ఉండకుండా చూడాలని కోరారు. అర్హులైన ప్రతీఒక్కరికి స్త్రీనిధి ద్వారా రుణాలు ఇవ్వాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ బోనగిరి నరేశ్, మెప్మా ఏవో శ్రీనివాస్‌గౌడ్, డీఎంసీ సునీత, టీఎంసీ రజిత, స్త్రీనిధి మేనేజర్ మారుతి, సీవోలు నాగరాణి, శరణ్య పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసే కుట్ర



పెగడపల్లిలో మాట్లాడుతున్న పేట భాస్కర్

పెగడపల్లి: అన్ని మత గ్రంథాలకు మూల విరాట్టుగా పేర్కొంటూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ప్రజాసంఘాల జేఏసీ కార్యానిర్వాహక కమిటీ, అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పేట భాస్కర్ పేర్కొన్నారు. పీజేఏసీ జిల్లా కార్యకర్తల సమావేశం పెగడపల్లిలో సోమవారం జరిగింది. భాస్కర్ మాట్లాడుతూ.. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని మార్చివేసి కులమతాల పేరిట గొడవలు సృష్టించేందుకు కేంద్ర ప్రభుత్వం పన్నుతున్న పన్నాగాన్ని తిప్పి కొట్టేందుకు ప్రజాసంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ రూపొందించినట్లు పేర్కొన్నారు. వచ్చేనెల 25న పెగడపల్లిలో సుమారు 15వేల మందితో జిల్లాస్థాయిలో రాజ్యాంగ రక్షణ సదస్సు పేరిట సభ ఏర్పాటు చేస్తున్నామని, కార్యక్రమానికి పీజేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు గజ్జెల కాంతం ముఖ్య అతిథిగా హాజరు అవుతారని అన్నారు. నాయకులు బొంకూర్ సన్నీ, పవన్, రాజు, రమేశ్, హన్మండ్లు, వినోద్, రాజయ్య, నరేశ్, పోచమల్లు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి



మాట్లాడుతున్న ప్రభాకర్

మల్లాపూర్(కోరుట్ల): కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సాంబారి ప్రభాకర్ అన్నారు. సోమవారం మల్లాపూర్ మండలం రాఘవపేట గ్రామంలో ప్రజాగోస- బీజేపీ భరోసా కార్యక్రమం నిర్వహించారు. ప్రభాకర్ మాట్లాడుతూ.. ఎనిమిదేళ్లలో కేంద్రం నిధులతో తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతోందని అన్నారు. ప్రతినెలా ఉద్యోగులకు జీతాలు ఇచ్చే పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం లేదని ఆరోపించారు. బీజేపీ మండలాధ్యక్షుడు ముద్దం సత్యనారాయణగౌడ్, నాయకులు దేవేందర్, భూమేశ్, కిరణ్, రవి, రాజేందర్, శేషు ఉన్నారు.

ర్యాగింగ్ భూతాన్ని అరికట్టాలి



ఆందోళన చేస్తున్న ఏబీవీపీ నాయకులు

జగిత్యాల: మెడికల్ కళాశాలల్లో ర్యాగింగ్ భూతాన్ని అరికట్టాలని, ఆత్మహత్యకు పాల్పడ్డ మెడికో ప్రీతి కుటుంబానికి న్యాయం చేయాలని, వేధింపులకు పాల్పడిన డాక్టర్ సైఫ్‌పై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జగిత్యాల మెడికల్ కళాశాలను బంద్ చేయించారు. విద్యార్థులకు రక్షణలేకుండా పోయిందని, ర్యాగింగ్ భూతం విద్యార్థుల పాలిట శాపంగా మారిందన్నారు. సైఫ్‌ను కఠినంగా శిక్షించాలని, 10 సంవత్సరాల పాటు చదువుల నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాపాక సాయికుమార్, నాయకులు నల్ల నవీన్‌కుమార్, నందు, గుగ్గిళ్ల అంజి, వినయ్, సాయికిరణ్, నిఖిల్, రాజు, మణికంఠ పాల్గొన్నారు.

అప్పులు.. తిప్పలు

అప్పు తెచ్చి మార్కెట్ల అభివృద్ధి పనులు

- తీర్చలేక తంటాలు పడుతున్న మార్కెటింగ్‌శాఖ అధికారులు
- మెట్‌పల్లి, జగిత్యాలపై రూ.11.05 కోట్ల భారం
- వచ్చే మార్కెట్ ఆదాయం జీతాలు.. నిర్వహణకే..



అప్పు తెచ్చి చల్‌గల్ మామిడి మార్కెట్‌లో నిర్మిస్తున్న షెడ్డు

జగిత్యాలఅగ్రికల్చర్: అప్పులు తీసుకొచ్చి ఏ పనీ చేయొద్దని పెద్దలు బుద్ధిమాట చెబుతుంటారు. కానీ, జిల్లాలోని మార్కెటింగ్‌శాఖ ఉన్నతాధికారులు రుణాలు తీసుకుని అభివృద్ధి చేయాలని, ఆ తర్వాత వచ్చే ఆదాయం నుంచి వడ్డీలు చెల్లించండి అంటూ సూచిస్తున్నారు. వారి ఆదేశాలను పాటిస్తూ స్థానిక మార్కెట్ అధికారులు రూ.కోట్లలో అప్పులు తీసుకొచ్చారు. అప్పు తీర్చాలని ఇచ్చినవారు ఒత్తిడి చేయడంతో ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు.

అన్నిచోట్లా అప్పులే..

- జిల్లా కేంద్రంలో మార్కెట్‌యార్డుకు స్థలం సరిపోక చల్‌గల్ వలంటరీ స్థలాన్ని తీసుకున్నారు. ఇందులో ధాన్యంతోపాటు మామిడి మార్కెట్ నిర్మించారు. యార్డులో అభివృద్ధి కోసం కాంగ్రెస్ హయాంలో చొప్పదండి నుంచి రూ.కోటి, వేములవాడ నుంచి రూ.50 లక్షలు, హుజూరాబాద్ నుంచి రూ.50 లక్షలు, సుల్తానాబాద్ నుంచి రూ.50 లక్షలు, గంగాధర నుంచి రూ.50లక్షలు, పెద్దపల్లి నుంచి రూ.85 లక్షలు అప్పులు తెచ్చారు. ఇప్పటికీ ఆ అప్పులు తీర్చలేదు. వడ్డీలు కూడా చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది.
- చల్‌గల్ మామిడి మార్కెట్ అభివృద్ధి కోసమని, ప్రస్తుతం మేడ్చల్ నుంచి రూ.2.20కోట్లు, ములుగు నుంచి రూ.కోటి, నర్సంపేట నుంచి రూ.50 లక్షలు, కథలాపూర్ నుంచి రూ.50 లక్షలు, లక్సెట్టిపేట నుంచి రూ.కోటి అప్పు తెచ్చారు. ఈ అప్పులకు ఏడాదికి వడ్డీ దాదాపు రూ.72.40 లక్షలు చెల్లించాలి.
- తమకు తక్షణమే చెల్లింపులు చేయాలంటూ అప్పు ఇచ్చిన మార్కెట్ కమిటీల నుంచి చల్‌గల్ మార్కెట్ అధికారులపై ఒత్తిడి వస్తోంది. కరోనాతోపాటు నాలుగైదేళ్లుగా మార్కెట్‌కు ఆశించిన ఆదాయం రావడంలేదు. అసలు ఏమోకానీ వడ్డీ కూడా చెల్లించని పరిస్థితి ఏర్పడింది.
- మెట్‌పల్లి మార్కెట్ యార్డులో ఇటీవల అభివృద్ధి పనులు చేసేందుకు, ఆ మార్కెట్ కమిటీలోని రూ.95లక్షలతోపాటు మల్లాపూర్ నుంచి రూ.కోటి, కోరుట్ల నుంచి మరో రూ.కోటి అప్పు తెచ్చారు.
- జగిత్యాల మార్కెట్‌యార్డుకు సుమారు రూ.3 కోట్ల వరకు ఆదాయం వస్తే, ఉద్యోగుల జీతభత్యాలు, నిర్వహణ వ్యయం పోతే మిగిలేది తక్కువే. అందుల్లోంచి వడ్డీలు చెల్లించడమే కష్టంగా మారింది. కొన్ని మార్కెట్లకు తమ వెసులుబాటును బట్టి వడ్డీలు చెల్లిస్తూ వస్తున్నారు. అయినప్పటికీ మొత్తం బాకీ చెల్లించాలని పట్టుబడుతున్నారు.

రెండు మార్కెట్లకే రూ.11.05 కోట్ల అప్పు

- జిల్లాలో 13 మార్కెట్ కమిటీలు ఉండగా, జగిత్యాల, మెట్‌పల్లి మార్కెట్ కమిటీలే రూ.11.05 కోట్ల అప్పు చేశాయి.
- మార్కెట్లలో అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం నేరుగా నిధులు మంజూరు చేసే బదులు, ఇతర మార్కెట్ల నుంచి అప్పుగా సమకూర్చుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నారు.
- అప్పును 10 వాయిదాల్లో తీర్చాలని, ఇందుకోసం 8 శాతం వడ్డీ చెల్లించాలని సూచిస్తున్నారు.
- క్షేత్రస్థాయి అధికారులు ఏమీ చేయలేక ఇతర మార్కెట్ల నుంచి నిధులు అప్పుగా తీసుకుంటూ అభివృద్ధి చేసుకుంటున్నారు.
- అయితే, అప్పులు ఇచ్చిన మార్కెట్ కమిటీల్లో నిధుల కొరత ఏర్పడి అక్కడ అభివృద్ధి కుంటు పడుతోంది.
- ఫలితంగా మార్కెట్ కమిటీల చైర్‌పర్సన్లు ఉత్సవ విగ్రహాలుగా మారిపోతున్నారు.
- కనీసం వడ్డీలు చెల్లించినా నెట్టుకు వస్తామంటూ మార్కెట్ చైర్‌పర్సన్లు, కార్యదర్శులు రుణగ్రహీతలకు లేఖలు రాస్తూ, ఫోన్లు చేస్తూ వస్తున్నారు.

మార్కెట్ అభివృద్ధి కోసమే



చల్‌గల్ మామిడి మార్కెట్‌ను తెలంగాణలో మోడల్ మార్కెట్‌గా మార్చుతున్నాం. ఇతర మార్కెట్ల నుంచి అప్పులు తెచ్చి షెడ్లు నిర్మించాం. దీంతో రాబోయే రోజుల్లో మార్కెట్ ఆదాయం గణనీయంగా పెరుగనుంది. ఆదాయం పెరుగుతుంది కాబట్టి అప్పులు తీర్చడం పెద్ద కష్టం కాదు.

– నక్కల రాధ, మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్, జగిత్యాల

అప్పు తీర్చుతాం



చల్‌గల్, మెట్‌పల్లి మార్కెట్ యార్డులకు అప్పు తెచ్చి అభివృద్ధి పనులు చేస్తున్నాం. డబ్బులు వృథా చేయడం లేదు. మ్యాంగో మార్కెట్‌లో అభివృద్ధి చేశాం. మామిడి క్రయ విక్రయాల ద్వారా మార్కెట్‌కు భారీగా ఆదాయం రానుంది. మార్కెట్లకు వస్తున్న ఆదాయాన్ని బట్టి అప్పులు తీర్చే ప్రయత్నం చేస్తున్నాం.

– ప్రకాశ్, జిల్లా మార్కెటింగ్ అధికారి

భయం.. భయం

- నూతన వైద్య కళాశాలలో సమస్యల వెల్లువ
- తరచూ ఆందోళనకర సంఘటనలు
- ఉన్నతాధికారుల పట్టింపు ఏది?



మెడికల్ కళాశాల

జగిత్యాల: జగిత్యాల జిల్లాకేంద్రంలో ఇటీవలే 150 మంది వైద్య విద్యార్థులతో మెడికల్ కాలేజీ ప్రారంభించిన కొద్దిరోజుల నుంచే సమస్యలు వెల్లువెత్తుతున్నాయి. తరుచూ పలు సంఘటనలు జరగడంతో విద్యార్థుల్లో భయాందోళన నెలకొంటోంది. గతంలో ఓ కార్యాలయంలో వైద్యులే మద్యం సేవించడం, ఆపై గొడవ చోటుచేసుకోవడం, ఆ సమయంలో కొందరు వైస్ ప్రిన్సిపాల్‌ను దూషించడంతో విద్యార్థులందరూ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఆ ఇద్దరు వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కానీ కొత్త కళాశాల అని, వివాదాస్పదం ఎందుకని పోలీసులు వైద్యుల మధ్య ఏకాభిప్రాయం కుదిర్చారు. కాగా కొద్దిరోజులకు కాలేజీ ఆవరణలో గుర్తుతెలియని ఓ నలుగురు వ్యక్తులు సంచరించగా ప్రిన్సిపాల్ ఎస్పీకి ఫిర్యాదు చేశారు. తాజాగా ఓ ఉద్యోగి మద్యం తాగి గర్ల్స్ హాస్టల్‌కు వెళ్లి అక్కడి వైద్య విద్యార్థులను రకరకాలుగా ప్రశ్నలు వేస్తూ ఇబ్బందులు పెట్టిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై చాలావరకు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయాన్ని 'సాక్షి' వెలుగులోకి తేవడంతో ఉన్నతాధికారులు విచారణ చేస్తున్నారు. ఇందుకోసం ఇద్దరు డాక్టర్లను నియమించారు.

వైద్య కళాశాలపై నిఘా ఎక్కడ?

ఈ సంవత్సరమే ప్రారంభమైన వైద్య కళాశాలపై ఉన్నతాధికారుల నిఘా లేకపోవడంతో కొందరు ఒకరోజువచ్చి మరొకరోజు రాకపోవడం, స్థానికంగా ఉండకపోవడంతో పాటు స్థానికంగా ఉన్న ఓ అధికారి ఆడిందే ఆటగా మారినట్లుగా సమాచారం. ప్రొఫెసర్లు సైతం స్థానికంగా ఉండకపోవడం ఇబ్బందికరంగా మారింది. కొత్త కళాశాల కావడంతో ఇక్కడ పూర్తిస్థాయిలో వసతులు లేకపోవడంతో చాలామంది ఇతర ప్రాంతాల నుంచే వస్తున్నారు. ఇప్పటికే విద్యార్థులు వసతిగృహాల్లో భోజనం సరిగా ఉండటం లేదని ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. వరుస సంఘటనలతో విద్యార్థుల్లో ఆందోళన నెలకొంది. ఓ వ్యక్తి మద్యం తాగి గర్ల్స్ హాస్టల్‌కు వెళ్లగా భయాందోళనకు గురై ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని కళాశాలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం

నూతన కళాశాలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. ఇటీవల జరిగిన సంఘటనలో పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం. ఏదైనా సమస్యలుంటే నేరుగా మా దృష్టికి తీసుకురావాలి.

– శివరాంప్రసాద్, ప్రిన్సిపాల్, మెడికల్‌కాలేజీ, జగిత్యాల

బ్రహ్మోత్సవాలకు కట్టుదిట్టమైన భద్రత

- ఎస్పీ భాస్కర్



ధర్మపురిలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ భాస్కర్

ధర్మపురి: ధర్మపురి నృసింహుడి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్పీ భాస్కర్ తెలిపారు. మార్చి 3 నుంచి 15 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తుండగా సోమవారం ఎస్పీ భాస్కర్ ధర్మపురిలో పర్యటించారు. బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లు పరిశీలించారు. నంది కూడలి, దేవస్థానం లోపల, బయట చేపడుతున్న పనులను తనిఖీ చేశారు. గోదావరి తీరప్రాంతాల్లో కల్పించనున్న వసతులు, జాగ్రత్తలపై ఆలయ అధికారులతో మాట్లాడారు. ఎస్పీ భాస్కర్ మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులతో పాటు వీవీఐపీలకు స్వామివారి దర్శన భాగ్యం కలిగించేలా ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయం లోపల, వెలుపల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, గోదావరి తీరప్రాంతాల్లో మహిళలు, చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని అన్నారు. గోదావరిలో నీరు అధికంగా ఉన్నందున గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. దొంగతనాలను అరికట్టేందుకు మఫ్టీలో కొందరు పోలీసులను విధుల్లో ఉంచుతున్నట్లు తెలిపారు. ఎస్పీ వెంట డీఎస్పీ ప్రకాశ్, సీఐ కోటేశ్వర్, ఎస్సై కిరణ్‌కుమార్, డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, రేనోవేషన్ కమిటీ సభ్యుడు రామన్న ఉన్నారు.



ధర్మపురి పట్టణంలో ప్రీతికి నివాళి అర్పిస్తున్న నాయకులు

ప్రీతికి నివాళి

ధర్మపురి: సీనియర్ వేధింపులతో ఆత్మహత్య చేసుకున్న మెడికో ప్రీతికి జిల్లావ్యాప్తంగా పలు సంఘాలు, విద్యార్థినేతలు నివాళి అర్పించారు. కొవ్వొత్తులతో ర్యాలీలు నిర్వహించి, ప్రీతి చిత్రపటం వద్ద జోహార్లు అర్పించారు. ధర్మపురి పట్టణంలో సోమవారం రాత్రి మహాజన సోషలిస్టు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అరికెల్ల సతీశ్ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రీతినాయక్ చిత్రపటానికి నివాళి అర్పించారు. మెడికల్ విద్యార్థిని మృతికి కారణం అయినవారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నాయకులు గంగారాం, ప్రేమిత్, పోచయ్య, లింగయ్య పాల్గొన్నారు.

జిల్లాలో కింగ్‌ఫిషర్ బీర్లు అందుబాటులోకి తేవాలి



ఫిర్యాదు చేస్తున్న రాజేశ్

జగిత్యాల: జగిత్యాలలోని వైన్‌షాపుల్లో కింగ్‌ఫిషర్ బీర్లు అమ్మడం లేదని, అందుబాటులోకి తీసుకురావాలని ప్రజావాణిలో రాజేశ్ అనే వ్యక్తి అడిషనల్ కలెక్టర్ లతకు ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వైన్స్ షాపుల్లో నాణ్యమైన బీర్లు అమ్మడం లేదని, రానున్న వేసవికాలంలో కింగ్‌ఫిషర్ బీర్లు అందుబాటులోకి తేవాలన్నారు. గతంలో కూడా ఓ వ్యక్తి కింగ్‌ఫిషర్ బీర్లు అమ్మేలా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశాడు. జగిత్యాల జిల్లా కేంద్రంతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో మాత్రమే అందుబాటులో ఉండవని, కొన్ని గ్రామాల్లో ఇవి అందుబాటులో ఉంటాయని పేర్కొన్నాడు. మద్యం వ్యాపారులంతా కుమ్మక్కై కింగ్‌ఫిషర్ నుంచి మార్జిన్ ఉండటం లేదని, దానిని నిషేధించినట్లు తెలిసింది.

దుబ్బరాజన్న సన్నిధిలో ఏకాదశ రుద్రాభిషేకం



కోడెమొక్కులు చెల్లిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కుటుంబం

సారంగాపూర్: ప్రముఖ పుణ్యక్షేత్రం దుబ్బరాజన్న ఆలయంలో స్వామివారికి అర్చకులు సోమవారం ఏకాదశ రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. మహాశివరాత్రి సందర్భంగా దుబ్బరాజన్న జాతర బ్రహ్మోత్సవాల తరువాత వచ్చే మొదటి సోమవారం స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. జిల్లా పరిషత్ చైరపర్సన్ దావ వసంత దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీపీ కోల జమున, ఈవో కాంతారెడ్డి, వ్యవస్థాపక ధర్మకర్త పొరండ్ల శంకరయ్య, సర్పంచ్ బొడ్డుపల్లి రాజన్న, విండో చైర్మన్ గుర్నాథం మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కంటి 'వెలుగు.. నీడలు'!



- 'కేసీఆర్ ప్రభుత్వం ప్రారంభించిన కంటి వెలుగు కార్యక్రమంలో నెలరోజుల క్రితం కంటిపరీక్షలు చేయించుకున్న. పాయింట్ ఉందని, చూపు సమస్య ఉందని చెప్పారు. అక్కడున్న డాక్టర్లు పేరు రాసుకుని త్వరలో అద్దాలు వస్తాయని చెప్పారు. ఇప్పటి వరకు రాలేదు. త్వరగా ఇస్తే బాగుండు.' కోరుట్ల మండలం సంగెం గ్రామానికి చెందిన బొలుమాలు రాజనర్సయ్య ఆవేదన ఇది..

- రీడింగ్ అద్దాలు సరే..
- దగ్గరి, దూరపుచూపు అద్దాలేవీ?
- ఎదురుచూస్తున్న లబ్ధిదారులు

కోరుట్ల: జిల్లావ్యాప్తంగా కొనసాగుతున్న కంటివెలుగు కార్యక్రమాన్ని నీడలు వెంటాడుతున్నాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ పథకం కింద రీడింగ్ అద్దాలు మాత్రమే అప్పటికప్పుడు అందిస్తున్నారు. ఇతర కళ్లఅద్దాలకు మాత్రం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా మోతెబిందు ఆపరేషన్ అవసరం ఉన్నవారు కేవలం పేరు నమోదుతో సరిపెట్టుకోవాల్సి వస్తోంది.

నెల గడిచినా నత్తనడకే

- జిల్లాలో కంటివెలుగు కార్యక్రమానికి జనవరి 19వ తేదీన శ్రీకారం చుట్టారు. జూన్ 2వ వారం వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. అవసరం ఉన్నవారికి కంటి పరీక్షలు నిర్వహించడానికి 8–12మంది సిబ్బందితో సుమారు 50 వైద్య బృందాలను ఏర్పాటు చేశారు.
- ఈ బృందాలు తమకు కేటాయించిన గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో కంటి సమస్యలు ఉన్న వారికి పరీక్షలు నిర్వహిస్తున్నాయి. జిల్లాలో మొత్తం 518 కంటి వెలుగు పరీక్ష శిబిరాలు ఏర్పాటుకు వైద్యఆరోగ్యశాఖ నిర్ణయించింది.



కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరం

- 383 గ్రామ పంచాయతీలు, ఐదు మున్సిపాలిటీల పరిధిలోని 135వార్డుల్లో శిబిరాలు నిర్వహిస్తారు. ఇప్పటి వరకు గ్రామ పంచాయతీల్లో 109 వైద్య శిబిరాలు, మున్సిపాలిటీల్లో 54వైద్య శిబిరాలు పూర్తి అయ్యాయి. ఒక్కో కంటివెలుగు బృందంలో 12మంది వరకు సిబ్బంది ఉంటుండగా.. భోజనాలు, టీ, టిఫిన్ కోసం రోజుకు ఇచ్చేది కేవలం రూ.1500 మాత్రమే.
- కంటి వెలుగు శిబిరాల్లో కంటి పరీక్షలు ముగిసిన వెంటనే రీడింగ్ గ్లాసెస్ మాత్రమే అందజేస్తున్నారు. దూర..ద్వంద్వ దృష్టి ఉన్న వారికి పరీక్షల అనంతరం ఆన్‌లైన్‌లో దృష్టిలోపం వివరాలు నమోదు చేయిస్తున్నారు. వీళ్లకు కళ్లద్దాల పంపిణీలో ఆలస్యం అవుతోంది. పరీక్షలు ముగిసి నెల గడుస్తున్నా కళ్లద్దాలు రాలేదు. లబ్ధిదారులకు ఎదురుచూపులు తప్పడం లేదు.
- గతంలో నిర్వహించిన కంటి వెలుగు పరీక్షల్లో మోతెబిందు ఆపరేషన్లు అవసరమైన వారి వివరాలు నమోదు చేసిన వైద్య సిబ్బంది ఆపరేషన్లు నిర్వహించలేదు. ఈ సారి అదే పరిస్థితి కొనసాగుతోంది. మోతె బిందు ఉండి ఆపరేషన్లు అవసరమైన వారి వివరాలు నమోదు చేసుకుంటున్నా ఆపరేషన్లు ఉంటాయో లేదో..చెప్పలేని పరిస్థితి.

జిల్లాలో కంటివెలుగు కార్యక్రమం ఇలా..

పరీక్షలు నిర్వహించిన వారిసంఖ్య	1,90,144
రీడింగ్ గ్లాసెస్ అందించిన వారి సంఖ్య	30,285
దూర ద్వంద్వ దృష్టి కళ్లద్దాలు అవసరమైన వారిసంఖ్య	34,817
ఇప్పటి వరకు దూర ద్వంద్వ దృష్టి కళ్లద్దాలు అందిన వారి సంఖ్య	1,556

అద్దాలు అందరికీ ఇస్తాం

కంటి వెలుగు పరీక్షలు నిర్వహించిన వారికి రీడింగ్ గ్లాసులు వెంటనే అందిస్తున్నాం. లోపాలు ఉన్న వారికి మాత్రం వారి అవసరాల ప్రకారం అద్దాలు అందించాలని ఆన్‌లైన్‌లో ఉన్నతాధికారులకు నివేదిస్తున్నాం. వీరిలో కొంత మందికి ఇప్పటికే అద్దాలు అందించాం. నిర్ణయించిన గడువులోగదా అందరికీ అద్దాలు అందిస్తాం.

– పుప్పాల శ్రీధర్, డీఎంహెచ్‌వో

క్లుప్తంగా

అంబాసిడర్ ఆఫ్ గుడ్‌విల్ అవార్డు అందజేత



అవార్డు అందుకుంటున్న రాజేంద్రప్రసాద్

కోరుట్ల: పట్టణానికి చెందిన న్యాయవాది అల్లై కటుకం రాజేంద్రప్రసాద్ అంతర్జాతీయ స్థాయి అంబాసిడర్ ఆఫ్ గుడ్ విల్ అవార్డు అందుకున్నారు. సామాజిక సేవారంగంలో ఆయన చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఆదివారం విశాఖపట్నంలో జరిగిన 15వ అంతర్జాతీయ సదస్సులో సంస్థ ఇంటర్‌నేషనల్ ప్రెసిడెంట్ అల్లై వి.ఎం.రావు అవార్డు అందించారు. సామాజిక సేవ చేస్తున్న నేపాల్, బంగ్లాదేశ్, ఇండియా, పిలిప్పీన్స్, నైజీరియా, అమెరికా దేశాలకు చెందిన 18 మందికి పురస్కారాలు అందించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంస్థ పాస్ట్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్స్ అల్లై బి.తిరుపతి, అల్లై శాంతమ్మ, అల్లై అవినాష్ చంద్ర ఓరి, ఇంటర్‌నేషనల్ సెక్రెటరీ అల్లై రాజేశ్వర్‌రావు, పీఆర్వో బాల గంగాధర్ శాస్త్రి, జిల్లా 1378 కరీంనగర్ ప్రతినిధులు, అలయన్స్ క్లబ్ కోరుట్ల ప్రతినిధులు రాజేంద్రప్రసాద్‌ను సోమవారం అభినందించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జగిత్యాల: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని ఏబీవీపీ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ యాస్మిన్‌బాషాను కలిసి, వినతిపత్రం అందజేశారు. దాదాపు రూ.5,500 కోట్లు ఫీజు బకాయిలను విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు వారి ముక్కు పిండి, ఫీజులు వసూలు చేస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మనువాడ నందు, నల్ల నవీన్, అంజి, వినయ్, నిఖిల్, సాయి పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో వైద్య అభ్యర్థుల జాబితా

జగిత్యాల: జాతీయ ఆరోగ్య మిషన్ కింద ఒప్పంద ప్రాతిపదికన ఆయుర్వేద, యునాని వైద్యాధికారుల పోస్టుల భర్తీ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల జాబితాను జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు కలెక్టర్ యాస్మిన్‌బాషా ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ వివరాలు పరిశీలించుకొని, ఏవైనా అభ్యంతరాలుంటే 28.02.2023 ఉదయం 10.30 గంటల నుంచి 04.03.2023 సాయంత్రం 5 గంటల్లోగా జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. గడువు తేదీ తర్వాత చేస్తే పరిగణలోకి తీసుకోబోమని పేర్కొన్నారు.

వేసవి పండ్లు.. అధిక లాభాలు

- వాటర్ మిలన్, మస్క్ మిలన్, జన్నత్ తోటల సాగు
- నేరుగా పట్టణాల్లో మార్కెటింగ్
- ఆదర్శం.. ముత్యంపేట యువరైతు దంపతులు



పుచ్చ, కర్బూజలను పట్టణాల్లో విక్రయిస్తున్న శ్రీనివాస్–మాధురి

జగిత్యాలఅగ్రికల్చర్: అతను చదివింది డిగ్రీ. ఆమె చదివింది ఇంటర్మీడియట్. వాళ్ల చదువుకు ఏదో చిన్నపాటి ఉద్యోగం రాకపోదు. కానీ ఇష్టపడుతూ, కష్టపడే వ్యవసాయంలోనే జీవనాన్ని సంతృప్తిగా కొనసాగించాలనుకున్నారు. వేసవిలో చల్లదనాన్ని ఇచ్చే పుచ్చ, కర్బూజ, జన్నత్ పండ్ల తోటలు సాగు చేస్తూ మంచి ఆదాయం పొందుతున్నారు. ఆదర్శంగా నిలుస్తున్న ఆ యువరైతు జంట జగిత్యాల జిల్లాలోని మల్లాపూర్ మండలం ముత్యంపేట గ్రామానికి చెందిన మరిపెల్లి శ్రీనివాస్–మాధురి.

హైదరాబాద్ నుంచి విత్తనాలు..

వీరి కుటుంబానికి ఏడెకరాల వ్యవసాయ భూమి ఉంది. మూడెకరాల్లో వరి, రెండున్నర ఎకరాల్లో పసుపు, మిర్చి, కంది, సోయా వంటి ఆరుతడి పంటలు, మిగిలిన ఎకరంన్నరలో స్వల్పకాలంలో లాభాలనిచ్చే పండ్ల తోటలు సాగు చేస్తున్నారు. ముఖ్యంగా పుచ్చకాయ(వాటర్ మిలన్), కర్బూజ(మస్క్‌మిలన్), జన్నత్(సూపర్ మార్కెట్ వెరైటీ) పండ్లు ఒక్కో రకాన్ని కనీసం 20 గుంటల్లో పండిస్తున్నారు. విత్తనాలను రూ.35 వేలు ఖర్చు పెట్టి, హైదరాబాద్ నుంచి తెప్పించారు.

కలుపు మొక్కలు రాకుండా మల్చింగ్ షీట్

పండ్ల తోటల్లో కలుపు మొక్కలు రాకుండా ఉండేందుకు రూ.20 వేలతో మల్చింగ్ షీట్ ఏర్పాటు చేశారు. విత్తనాలు నాటే ముందు భూమిని నాలుగైదుసార్లు బాగా దున్ని, కోళ్ల ఎరువు చల్లారు. విత్తనాలు నాటే సమయంలో డీఏపీ, మధ్యలో సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ ఎరువులు వేశారు. మొగ్గ దశలో వర్మీ కంపోస్టును మొక్కల మొదళ్ల వద్ద వేశారు. అవసరాన్ని బట్టి డ్రిప్ ద్వారా సాగు నీరందించారు. 2 సార్లు తెగుళ్లు, పురుగులు ఆశించకుండా పురుగు మందులు పిచికారీ చేశారు. 80 రోజుల్లోనే కాయలు రెండున్నర కిలోల నుంచి 3 కిలోలు కావడంతో, ఈ నెల 20 నుంచి విక్రయిస్తున్నారు.

ఏరోజుకారోజే కాయలు తెంపడం..

పంట చేతికొచ్చే ముందు ఒకటికి రెండుసార్లు కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల్లో మార్కెటింగ్ తీరును తెలుసుకున్నారు. తాజాగా ఉండేందుకు, ఏరోజుకారోజు ఉదయం దంపతులిద్దరూ కాయలు తెంపి, సొంత వాహనంలో మార్కెట్‌కు తీసుకెళ్తున్నారు. వాహనానికి రైతు టు కస్టమర్ ఓన్లీ అంటూ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పుచ్చకాయ కిలో రూ20 చొప్పున, ఖర్బూజను కిలోకు రూ.40, జన్నత్‌ను కిలో రూ.20 చొప్పున విక్రయిస్తున్నారు. మొత్తం ఎకరంన్నర భూమిలో మూడు పంటల కాయలు కలిపి 30 టన్నుల వరకు వచ్చే అవకాశం ఉందని, దాదాపు రూ.3 లక్షల వరకు ఆదాయం వస్తుందని వారు చెబుతున్నారు.



వాటర్ మిలన్, మస్క్ మిలన్

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈని సస్పెండ్ చేయండి

- చేయని పనులకు దొంగ రికార్డులు సృష్టించారు..
- ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు గంగారెడ్డి



ఏఈపై ఫిర్యాదు చేస్తున్న గంగారెడ్డి

బుగ్గారం(ధర్మపురి): మిషన్ భగీరథ పనుల్లో చేయని పనులకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దొంగ ఎంబీ రికార్డులు సృష్టించారని టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు చుక్క గంగారెడ్డి ఆరోపించారు. ఆయనను తక్షణమే సస్పెండ్ చేయాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేశారు. బుగ్గారం బస్టాండ్ ప్రాంతంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద 2015–16లో అప్పటి సర్పంచ్ సుద్దాల శరత్ హయాంలో బోర్‌వెల్ వేసి, మోటార్ బిగించారని తెలిపారు. ఆ పనులకు ప్రభుత్వం బిల్లులు సైతం చెల్లించిందన్నారు. కానీ అదే బోరుకు కొత్తగా బోర్ వేసినట్లు ఏఈ దొంగ రికార్డులు సృష్టించారని పేర్కొన్నారు. అలాగే 2015లో గ్రామస్తుల సౌకర్యార్థం మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయగా తాగునీటి బావి తవ్వి, గాజులు వేశారన్నారు. ఆ పనులను తామే చేశామని నూతన పాలకవర్గం తప్పుడు తీర్మానం చేయగా ఏఈ సహకరించి, రూ.3 లక్షలకు దొంగ ఎంబీ రికార్డులను తయారు చేశారని చెప్పారు. వీటితోపాటు పల్లె ప్రగతి పనుల్లో అనేక అవకతవకలు జరిగాయని తెలిపారు. ప్రభుత్వాన్ని మోసం చేస్తున్న అధికారి, ప్రజాప్రతినిధులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

జాతీయ తైక్వాండో పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు

కోరుట్ల: మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఘట్కేసర్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర ఇంటర్ డిస్ట్రిక్ట్ తైక్వాండో చాంపియన్‌షిప్‌లో జిల్లాకు చెందిన క్రీడాకారులు సత్తా చాటారు. ఎస్.మహేశ్, గోల్కొండ నాగమణి, గజం దీక్షిత, గుండవేణి హర్షిణి, శ్రీ వాస్తవలు బంగారు, కడారి సిరిచందన, పీయుష్ చౌరస్య, గౌతమ్ కృష్ణలు కాంస్య పతకాలు సాధించారు. వీరిలో దీక్షిత, హర్షిణి, నాగమణి, మహేశ్, శ్రీవాస్తవలు జాతీయస్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్‌నకు అర్హత సాధించారు. వీరు మార్చిలో రాజస్థాన్‌లో జరిగే పోటీల్లో పాల్గొననున్నారు. తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోషియేషన్ కార్యదర్శి కుర్వ శ్రీహరి, జాయింట్ సెక్రటరీ సి.సంతోష్, కరీంనగర్ జిల్లా కార్యదర్శి సంతోష్, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు గంగారావు, కోరుట్ల కోచ్ మాస్టర్ నేతాజీ, మాస్టర్లు షోయబ్, మదీహా, విజయ్, రాజేశ్ సోమవారం అభినందించారు.

ఫోన్‌లో మాట్లాడి 13 రోజులకు శవమై వచ్చాడు

- సౌదీలో ధర్మపురి తోట్లవాడవాసి మృతి
- మరణవార్తను రహస్యంగా ఉంచిన అతని స్నేహితులు
- మృతదేహం ఇంటికి చేరడంతో కన్నీరుమున్నీరైన కుటుంబసభ్యులు



శ్రీనివాస్ (ఫైల్)

ధర్మపురి: బతుకుదెరువు కోసం గల్ఫ్ వెళ్లిన ఓ వలస జీవికి గుండెపోటు రావడంతో మృతిచెందాడు. అతని మృతదేహం 13 రోజులకు ఇంటికి చేరింది. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మపురి పట్టణంలోని తోట్లవాడకు చెందిన వొజ్జల శ్రీనివాస్(50) కొన్నేళ్లుగా సౌదీ వెళ్తున్నాడు. అతనికి భార్య పద్మ, బీటెక్ చదువుతున్న ఇద్దరు కవల కూతుళ్లు, పదోతరగతి చదువుతున్న ఒక కుమారుడు ఉన్నారు. రెండు నెలల క్రితం తల్లి సత్తవ్వకు ఆరోగ్యం బాగా లేదని చెప్పడంతో వచ్చాడు. ఆమెకు ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించి, మళ్లీ వెళ్లాడు. నిత్యం ఫోన్‌లో భార్యాపిల్లలు, తల్లితో మాట్లాడుతుండేవాడు. ఈ నెల 14న ఉదయం పనికి వెళ్తుండగా మార్గమధ్యలో గుండెపోటుకు గురై, కిందపడిపోయాడు. తోటి స్నేహితులు ఆస్పత్రికి తీసుకెళ్లి, చికిత్స చేయిస్తుండగా మృతి చెందాడు. శ్రీనివాస్ మరణ వార్తను అతని కుటుంబసభ్యులకు తెలపకుండా రహస్యంగా ఉంచారు. సోమవారం మృతదేహం ఇంటికి చేరడంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఊహించని ఈ సంఘటనతో తోట్లవాడలో విషాదఛాయలు అలుముకున్నాయి. బంధువులు శ్రీనివాస్ మృతదేహానికి ధర్మపురిలో అంత్యక్రియలు నిర్వహించారు.



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

సైన్స్ క్రియేటివిటీ క్లబ్‌కు విద్యార్థుల ఎంపిక



క్లబ్‌కు ఎంపికైన విద్యార్థులు

మల్లాపూర్(కోరుట్ల): ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ద్వారా 10 నుంచి 14 ఏళ్ల వయసున్న పిల్లలకు సోమవారం సైన్స్ క్రియేటివిటీ క్లబ్ నిర్వహించారు. వీవీరావుపేట్‌కు చెందిన నవీన్, వేంపేట్‌కు చెందిన పి.నితిన్, మెట్‌పల్లి మండలానికి చెందిన శ్రీజ, వర్షకొండకు చెందిన ఓ.నితిన్, వేములకుర్తికి చెందిన రిశ్విత, మేడిపల్లికి చెందిన రిష్వంత్ ఎంపికయ్యారని కో–ఆర్డినేటర్ రాజేశ్ తెలిపారు. మరో 10 రోజుల్లో రంగారెడ్డి జిల్లాలో నిర్వహించే ప్రథమ్ ఎడ్యుకేషన్ సెంటర్‌లో రాష్ట్రవ్యాప్తంగా ఎంపికైన విద్యార్థులు శాస్త్రవేత్తలతో కలిసి పాల్గొంటారని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మల్లాపూర్(కోరుట్ల): మల్లాపూర్‌మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన బదావత్ రాము సోమవారం ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొట్టిందని ఎస్సై నవీన్ తెలిపారు. ఈ సంఘటనలో అతనికి గాయాలయ్యాయని, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని అన్నారు. బాధితుడి భార్య మానస ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఒకరిపై అట్రాసిటీ కేసు

మల్లాపూర్(కోరుట్ల): మండలంలోని కుస్తాపూర్ గ్రామానికి చెందిన జెల్ల రాజన్న సోమవారం తన తోట నుంచి కట్టెలు తీసుకొని వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన సుంకరి రాజు కులం పేరుతో దూషించాడని ఎస్సై నవీన్ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితుడిపై అట్రాసిటీ కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

యాదవులు అన్ని రంగాల్లో రాణించాలి



నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న నాయకులు

మల్లాపూర్(కోరుట్ల): యాదవులు అన్ని రంగాల్లో రాణించాలని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌యాదవ్ అన్నారు. సోమవారం మల్లాపూర్ మండల కేంద్రంలోని శ్రీవెంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 90 శాతం నిరుపేదలు ఉన్న యాదవులకు ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి, ఆదుకోవాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గనవేని మల్లేశ్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ముఖేశ్‌యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

మండల నూతన కార్యవర్గం ఎన్నిక

అఖిల భారత యాదవ మహాసభ మల్లాపూర్ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా సంతోశ్, అధ్యక్షుడిగా గంగరాజం, ప్రధాన కార్యదర్శిగా రాకేశ్, ఉపాధ్యక్షులుగా సతీశ్, మల్లయ్య, మదన్, శ్రీనివాస్, అధికార ప్రతినిధిగా చంద్రయ్య, ప్రచార కార్యదర్శిగా రమేశ్, సలహాదారుగా గంగరాజం ఎన్నికయ్యారు.

అనుమానాస్పదస్థితిలో ఒకరి మృతి

కరీంనగర్‌క్రైం: అనారోగ్య కారణాలతో బాధపడుతున్న వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. కరీంనగర్ వన్‌టౌన్ పోలీసుల వివరాలు.. నగరానికి చెందిన పి.కనకయ్య హమాలీ పని చేసుకుంటూ జీవించేవాడు. అతడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉండగా వారిని వదిలేసి ఇక్కడ వేరే మహిళతో ఉంటున్నాడు. బీపీ, షుగర్ ఉండడంతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలు వేధించడంతో నిత్యం మద్యం తాగేవాడు. ఆదివారం సిక్‌వాడిలో కిందపడి ఉన్నాడు. స్థానికులు గమనించి, అతడి కుటుంబ సభ్యులకు సమాచారమందించారు. వారు వచ్చి చూడగా అప్పటికే చనిపోయి ఉన్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

జమ్మికుంట(హుజూరాబాద్): రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ తిరుపతి వివరాలు.. జమ్మికుంట మున్సిపల్ పరిధి కొత్తపల్లికి చెందిన బత్తుల దేవేందర్ (40) ఆదివారం రాత్రి రైల్వేస్టేషన్ పరిధిలో గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. దేవేందర్ సెంట్రింగ్ పని చేస్తుంటాడు. మద్యానికి బానిస కాగా అనారోగ్యానికి గురయ్యాడు. మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు సోమవారం గుర్తించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

గంజాయి పట్టివేత



మాట్లాడుతున్న సీఐ గురవయ్య

మంథని: మండలంలోని మల్లేపల్లి గ్రామంలో గువ్వల వెంకటి ఇంట్లో గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ గురవయ్య తెలిపారు. గ్రామంలోని ఓ వ్యక్తి గంజాయిని విక్రయిస్తున్నాడన్న సమాచారం మేరకు సోదాలు నిర్వహించామన్నారు. సోమవారం వెంకటి ఇంట్లో 850 గ్రాముల గంజాయి లభ్యమైనట్లు తెలిపారు. సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. గంజాయిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్‌ఐ సాయిరాంను ఉన్నతాధికారులు అభినందించారు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. దాడుల్లో శ్యాం, శ్రీనివాస్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఐటీ, సోషల్ మీడియా జాయింట్ కన్వీనర్‌గా వెంకటేశ్



మల్లాపూర్(కోరుట్ల): బీజేపీ ఐటీ, సోషల్ మీడియా కోరుట్ల అసెంబ్లీ జాయింట్ కన్వీనర్‌గా బండారి వెంకటేశ్‌ను నియమించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.సత్యనారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఎంపీ ధర్మపురి అర్వింద్, పార్టీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరావు, ఐటీ సెల్ రాష్ట్ర జాయింట్ కన్వీనర్ సాయికుమార్‌లకు వెంకటేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

సీవీ రామన్ సేవలు మరువలేనివి



విద్యార్థులతో నరేందర్‌రెడ్డి

జగిత్యాల: భౌతికశాస్త్రంలో నోబెల్ బహుమతి గెలుచుకున్న భారతీయ శాస్త్రవేత్త సర్ సీవీ రామన్ సేవలు మరువలేనివని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం జగిత్యాలలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీవీ రామన్ చిన్నతనం నుంచే వైజ్ఞానిక శాస్త్రంలో గొప్ప విషయాలు కనుగొని, అద్భుత విజయాలు సాధించారన్నారు. తనదైన శైలి, విభిన్నమైన ఆలోచనలతో పరిశోధనలు చేశారని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థుల ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రైస్‌మిల్లులో అగ్ని ప్రమాదం



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

వెల్గటూర్(ధర్మపురి): సంకెనపెల్లి శివారులోని రాజరాజేశ్వర రైస్‌మిల్లులో సోమవారం షార్ట్‌సర్క్యూట్‌తో డ్రై ఎలివేటర్‌లో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో డ్రై ఎలివేటర్‌తోపాటు మిల్లులోని కొన్ని భాగాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ధర్మపురి, చొప్పదండి నుంచి ఫైర్ ఇంజిన్లు వచ్చి, మంటలను ఆర్పివేశాయి. నిజామాబాద్ అసిస్టెంట్ డివిజనల్ ఫైర్ ఆఫీసర్ భానుప్రతాప్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. సుమారు రూ.15 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు రైస్‌మిల్లు యజమాని జీరెడ్డి మహేందర్‌రెడ్డి తెలిపారు.